తుర్కయాంజాల్‌లో..

షాబాద్ సరస్వతి శిశుమందిర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

షాద్‌నగర్‌రూరల్

షాద్‌నగర్ టౌన్

సందడే.. సందడి

ఉల్లాసంగా.. ఉత్సాహంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను కనులపండువగా జరుపుకొన్నారు. చిన్నారులను రాధాకృష్ణుల వేషధారణలో అలంకరించి తల్లిదండ్రులు మురిసిపోయారు. చిన్నికృష్ణుడిని ఇంట్లోకి ఆహ్వానిస్తూ తమ నివాసాల్లో గోపాలుడి పాదాలను వేశారు. పలు గ్రామాల్లో ఉట్టి కొట్టి, పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో ప్రతి ఇల్లు చిన్నారులతో సందడిగా మారింది. ఆలయాల్లో ఉదయం నుంచి శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేసి, స్వామివారికి ఇష్టమైన పిండి వంటకాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి, చిన్నపిల్లలకు కూడా తులాభారం నిర్వహించారు.

- రంగారెడ్డిజిల్లా న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ

నందిగామ

ఇబ్రహీంపట్నం : కౌన్సిలర్ సత్యనారాయణ ఇంట్లో 106 వంటకాలతో శ్రీకృష్ణుడికి పూజలు

మొయినాబాద్ : కనకమామిడి వేంకటేశ్వరాలయంలో కృష్ణుడి వేషధారణలో ఉన్న చిన్నారికి తులాభారం

కొత్తూరు : ఫరూఖ్‌నగర్‌లో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

షాబాద్ : కుమ్మరిగూడలో..

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య


కడ్తాల్ : పోచమ్మ ఆలయంలో నిర్వహించిన పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, ఆగస్టు 26 : సమాజంలో ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. కడ్తాల్ గ్రామ దేవతైన పోచమ్మతల్లి ఆలయంలో బోనాల పండుగ సందర్భంగా సోమవారం తెల్లవారుజామున ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అర్చనలు, హారతి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఎంపీ, ఎమ్మెల్యే, ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామ పెద్దలు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సకాలంలో వానలు కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో, పాడిపంటలతో చల్లగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సత్యంయాదవ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, మండలాధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, నర్సింహ, మల్లేశ్‌గౌడ్, రాములు, నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కార్తీక్, బీక్యానాయక్, భిక్షపతి, మహేశ్, హర్షవర్ధన్, జగన్, మహేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రవి, సాయిప్రభు, శ్రీకాంత్, దేవేందర్‌గౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

కడ్తాల్, షాబాద్ మండలాల్లో పోచమ్మ బోనాలు

ముద్దెంగూడలో..

షాబాద్ : మండలంలోని ముద్దెంగూడ గ్రామంలో పోచమ్మ బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులంతా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపు చేపట్టారు. బోనాల ఉత్సవాల్లో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతలతో గ్రామం మార్మోగింది.

షాబాద్ : ముద్దెంగూడలో పోచమ్మ బోనాల ఉత్సవాలు


షాద్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రుణమాఫీపై ఆందోళన చెందొద్దు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఆగస్టు 26 : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీని అర్హత కలిగిన ప్రతి రైతుకూ వర్తింపచేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అర్హులకు రుణమాఫీ రాకుంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బాధిత రైతులు సంబంధిత అధికారుల దృష్టికి తెస్తే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తారని చెప్పారు. సోమవారం షాద్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే వ్యవసాయ శాఖ అధికారులు రైతుల సందేహాలపై తక్షణమే స్పందించి తగిన సలహాలు, సూచనలు చేయాలని చెప్పారు. సాంకేతిక కారణాలతో పలువురికి రైతు రుణమాఫీ జాబితాల్లో పేర్లు రాలేదని, అంతమాత్రాన ఎవ్వరు కూడా ఆందోళన చెందవద్దని సూచించారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, ఏవైనా సమస్యలుంటే రైతులు నేరుగా తమ దృష్టికి తేవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రాజారత్నం, మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హైడ్రాను షాద్‌నగర్‌కు వర్తింపజేయండి

చెరువులు, కుంటలు, కాలువల సంరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీలో చేపట్టిన హైడ్రా చర్యలు హర్షదాయకమని, హైడ్రాను షాద్‌నగర్ ప్రాంతానికి కూడా వర్తింపజేయాలని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని కోరారు. హైడ్రా అనుసరిస్తున్న తీరును సామన్య ప్రజలు స్వాగతిస్తున్నారని, భవిష్యత్ తరాలకు సహజ సంపదను అందజేయాలంటే ఈ తరహా చర్యలు అవసరమన్నారు. షాద్‌నగర్ వంటి ప్రాంతాల్లో హైడ్రాను పూర్తిస్థాయిలో అమలుచేస్తే చెరువులు, కుంటలు కబ్జాలకు గురికావని, భూగర్భ జలాలు సైతం పెరుగుతాయన్నారు. అన్నిటికి మించి ప్రభుత్వ భూములకు రక్షణ లభిస్తుందని చెప్పారు. కొన్ని రోజులుగా హైడ్రా చేపట్టిన చర్యలు మంచి ఫలితాన్ని ఇస్తున్నాయని, చెరువులను కబ్జా చేయాలంటే వెన్నులో వణుకు పుట్టే రోజులు వచ్చాయన్నారు. పర్యావరణ విధ్వంసం మంచిది కాదని, అన్ని వర్గాల ప్రజలు హైడ్రా చర్యలను స్వాగతించాలని కోరారు.

శంకర్‌పల్లి మున్సిపాలిటీలో కుక్కలను పడుతున్న సిబ్బంది

శునకాల బెడద తగ్గించేందుకు కృషి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

చేవెళ్ల రూరల్, ఆగస్టు 26 : శంకర్‌పల్లి మున్సిపాలిటీలో కుక్కల బెడదను తగ్గించేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం శంకర్‌పల్లిలోని 11, 14, 15 వార్డులు, తహసీల్దార్ కార్యాలయం వెనకాల సంచరిస్తున్న వీధి కుక్కలను మున్సిపల్ సిబ్బంది పట్టుకొని యానిమల్ బర్త్ సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. శంకర్‌పల్లి మున్సిపల్‌కు, బ్లూ క్రాస్ సొసైటీ హైదరాబాద్ వారికి మధ్య రూ.8.75 లక్షలతో ఎంవోయూ కుదుర్చుకున్నామని చెప్పారు. వీధి శునకాలపై ఇప్పటికే కౌన్సిల్‌లో చర్చించామని, కుక్కల తరలింపునకు సంబంధించిన విధానాలు నిరంతరంగా సాగుతున్నాయని తెలిపారు. ఒక్కో కుక్క తరలింపు కోసం రూ.1,650 వెచ్చిస్తున్నామని, గత నెల రోజుల నుంచి పట్టణ పరిధిలోని వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ ఏఆర్‌వీ ఇంజక్షన్స్ (యాంటీ రేబిస్ వ్యాక్సిన్) కోసం యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్లకు తరలిస్తున్నామన్నారు. కుక్కలకు ఇంజక్షన్ చేసి తిరిగి పట్టణంలోనే వదిలివేయడం జరుగుతుందన్నారు. ఈ ఇంజక్షన్ చేసిన కుక్కలు విపరీతంగా ప్రవర్తించే లక్షణాలు తగ్గుతాయని, కుక్కలు కరవడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని పేర్కొన్నారు. వాక్సినేషన్ చేసిన కుక్కలకు గుర్తుగా చెవి వద్ద వి షేప్ కటింగ్ చేసి ఉంటుందన్నారు. పట్టణ ప్రజలు ఎక్కడైనా కుక్కల బెడద ఉన్నట్లయితే మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడేవారికి గుర్తింపు

కడ్తాల్‌లో ఎర్రోళ్ల రాఘవేందర్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కడ్తాల్, ఆగస్టు 26 : ప్రజా సమస్యలపై పోరాడే నాయకులకు గుర్తింపు లభిస్తుందని మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. కడ్తాల్‌కు చెందిన ఎర్రోళ్ల రాఘవేందర్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాఘవేందర్‌ను బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కులగణన చేపట్టాని డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సువాలీపంతూ నాయక్, మాజీ సర్పంచ్ హరిచంద్‌నాయక్, మాజీ ఎంపీటీసీ రమేశ్‌నాయక్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్ అలీ, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గంపజాతర

వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

చేవెళ్లటౌన్, ఆగస్టు 26 : చేవెళ్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గంపజాతర కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల గ్రామస్తులతోపాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలోనే పాయసం, పిండి వంటలు చేసుకొని భోజనాలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి గరుడ సేవా కార్యక్రమలను భక్తులతో కలిసి ఊరేగింపుగా నిర్వహించారు. గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

కొమరబండలో శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

షాబాద్, ఆగస్టు 26 : ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో బుగ్గరామేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు చంద్రశేఖర్, దేవేందర్‌రెడ్డి, రమేశ్‌రావుపంతులు పాల్గొన్నారు.

షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో వినాయక మండపాల ఆర్గనైజర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కాంతారెడ్డి

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

షాబాద్, ఆగస్టు 26 : పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని షాబాద్ సీఐ కాంతారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని ఆయా గ్రామాల వినాయక మండపాల ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. నిమజ్జనాల సమయంలో డీజేలకు అనుమతులు లేవని చెప్పారు. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు.

పోలీసులకు వేగ నియంత్రికలను అందజేస్తున్న మార్ల సుదర్శన్, నాయకులు

వాహనాలను అతి వేగంతో నడుపవద్దు

కడ్తాల్ (తలకొండపల్లి), ఆగస్టు 26 : వాహనాలను అతి వేగంతో నడిపి ప్రమాదాల బారిన పడవద్దని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ నర్సింహ అన్నారు. తలకొండపల్లికి చెందిన మార్ల వేణు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. తన తమ్ముడికి జరిగిన ప్రమాదం వేరొకరికి జరగకుండా ఉండేందుకు అతడి జ్ఞాపకార్థం, సోదరుడు మార్ల సుదర్శన్ తన సొంత నిధులతో సమాకూర్చిన నాలుగు వేగ నియంత్రికలను సోమవారం పోలీసులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అతి వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావొద్దని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌ను నాయకులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతయ్య, నాయకులు శేఖర్, దశరథం, పాండు, శ్రీశైలం, రమేశ్, రఘువరన్, నితీశ్ పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

మొయినాబాద్, ఆగస్టు 26 : మండలపరిధిలోని కనకమామిడి గ్రామంలో గల భ్రమరాంబ సంగమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ గర్భగుడి ఎదుట అమ్మవారికి కుంకుమార్చన కనులపండువగా నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ వ్రతం జరిగింది. భక్తుల కోసం పెద్దమంగళారం గ్రామానికి చెందిన బొడ్డు మల్లారెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్, నాయకులు పాల్గొన్నారు.

సంగమేశ్వర ఆలయంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ అశోక్‌రావు

తనిఖీలు చేస్తున్న తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ అశోక్‌రావు

తుర్కయాంజాల్, ఆగస్టు 26 : ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు వస్తువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ రంగారెడ్డి జిల్లా ఇన్‌స్పెక్టర్ అశోక్‌రావు అన్నారు. సోమవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడలోని మిస్టర్ ఇరానీ చాయ్ దుకాణంలో కూల్‌డ్రింక్‌ను ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు విక్రయించడంతో స్థానికులు అన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని దుకాణ యజమానిపై కేసు నమోదు చేయడంతోపాటు ఫ్రిడ్జ్‌ను సీజ్ చేశారు.

పందుల స్వైరవిహారం

ఆమనగల్లు, ఆగస్టు 26 : ఆమనగల్లు మున్సిపాలిటీలోని బీసీ కాలనీలో పందులు రోజూ స్వైరవిహారం చేస్తున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. వెంటనే సమస్య తీర్చాలని కాంగ్రెస్ నాయకుడు బాబా కోరారు.

మైసిగండి మైసమ్మతల్లి సన్నిధిలో హైకోర్టు ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు

నూతన చట్టాలపై అవగాహన అవసరం

కడ్తాల్, ఆగస్టు 26 : న్యాయ వ్యవస్థలో వచ్చిన నూతన చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని హైకోర్టు ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం కడ్తాల్, ఆమనగల్లు మండలాల పరిధిలోని మైసిగండి మైసమ్మతల్లి, అయ్యసాగర క్షేత్రంలోని వీరభద్రస్వామి ఆలయాలను ఆయన సందర్శించారు. కుటుంబసభ్యులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్ కాలం నుంచి వస్తున్న న్యాయ చట్టాలకు తెరపడిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల న్యాయ వ్యవస్థలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం అనే మూడు కొత్త నేర చట్టాలను తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనను సన్మానించి, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, రైతుబంధుసమితి జిల్లాసభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ఉప్పల చారిటబుల్ ట్రస్టు సభ్యులతో రఫీ దంపతులు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఆమనగల్లు, ఆగస్టు 26 : ఆమనగల్లు మున్సిపాలిటీకి చెందిన ఎండి రఫీ దంపతుల కుమారుడు బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ తన ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా వైద్య చికిత్స నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు శ్రీశైలంగౌడ్, మాజీ సర్పంచ్ గోపాల్‌నాయక్ ఉన్నారు.